పోతుకూచి

సాంబశివరావు



# పెళ్ళిడ్గ వచ్చివుంటే

రాత్రి పదిన్నర దాటింది. వికలమైన మనస్సుతో చంద్రశేఖరం కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాడు. చేతివేళ్ళ మధ్య వుత్తరం నలిగిపోతోంది అతనికి తెలియకుండానే.

మనోరమ వ్రాసింది ఉత్తరం; తన వివాహానికి తప్పకరమ్మని. దూరప్రాంత మైన బెంగుళూరువెళ్ళడం కష్టంకాదు కాని ఆమె వివాహమే అతన్ని ఆలోచనలతో నింపింది. ఆలోచించి, వివాహానికి వెళ్ళడం కంటె. ఏదో ఒకబహుమతి పంపి ఊరుకుంటే బాగుంటుందనుకున్నాడు. ఆ ఉత్తరం అందిన సమయానికి వివాహసమయం సరిగా రెండురోజులుంది. ఇంతతొందరలో వూరువిడిచి వెళ్ళడం కొంచెంకష్టం అనుకున్నాడు చంద్రశేఖరం.

మనోరమకు చాలా ఆలస్యంగా వివాహం కుదిరింది. ఆమెతండ్రి చిన్నతనంలో చనిపోయేడు. ఆమెను ఆదరి



స్తున్న అన్నగార్లు ఆమెకు వివాహం చెయ్యడంలో అశక్తులయ్యారు. మంచి అందకత్తె కాకపోవడం, సంఘంలో కలిసిమెలిసి చలాకీగా ఉండకపోవడం. ఆమెకు ప్రేమవివాహానికి ఎక్కువ అవకాశం యివ్వలేదు. వయస్సుముదిరిన కొలదీ తగిన వరుడు లభ్యంకాలేదు ప్రయత్నించే అన్నగారికి. చివరకు సంబంధం నిశ్చయించారు. మనోరమ వివాహం జరగబోతోంది.

మనోరమ, మంగళ, రెండుసంవత్సరాలక్రితం తనయింటికి ఒకసారి వచ్చారు. చంద్రశేఖరానికి బాగాగుర్తు. భార్యపోయినదినాల్లో బాధగా మూల్గుతూ ఒంటరిగా అశాంతితో బ్రతుకుతున్నప్పుడు, భార్యస్నేహితురాలిగా మంగళవచ్చి అప్పుడప్పుడు మాట్లాడడం కొంత ఉపశమనంగానే ఉండేది. ఆరోజు మంగళ, మనోరమను వెంటబెట్టుకునివచ్చి పరిచయంచేసింది.

ఒకవారంరోజులు మామూలు పరిచయంతర్వాతమనోరమ బెంగుళూరువెళ్ళిపోయింది. చంద్రశేఖరానికి స్నేహంగా ఉత్తరాలు వ్రాసింది. జీవితంలో వచ్చే కష్టాలు ధైర్యంగా ఎదుర్కోవాలని సానుభూతి చూపించేది. ఏమిటో మనోరమలో మంచితనం ఉందని నిర్ణయించుకున్నాడు చంద్రశేఖరం. ఎదురుగా పడకగది గోడమీద భార్య ఫోటో నిల్చుంది. ఆ రాత్రి శీతలవాయువులు శరీరాన్ని కొరుకుతున్నాయి. ఆలోచించి చలి రాత్రుల్లో ఆమెయిచ్చిన వెచ్చతనం, మధురస్మృతుల్లా కదిలాయి చంద్రశేఖరం హృదయంలో. మత్తుగా ఆలోచిస్తూ మాగనిద్రలో ఒరిగాడు అతను. నెలపై వారంరోజులు గడిచాయి.

చంద్రశేఖరం మనోరమను బస్సుస్టాండువద్ద కలిశాడు. అతను ఆశ్చర్యపోయాడు ఆమె కనిపించగానే. మనోరమ ఈ వూళ్ళో వుంటున్న సంగతి అతనికి తెలియదు. మంగళకూడా ఈమధ్య అతన్ని కలుసుకోలేదు మనోరమ సమాచారం తెలుసుకోడానికైనా.

మనోరమ వదనం వికసించింది. అతన్నిచూడగానే ఎవరో ఆప్తులు కనిపించినంతగా ఆనందించినట్లు ఆమె ప్రవర్తన ద్యోతకమయింది.

'ఈవూళ్ళోనే వుంటున్నారా? ప్రశ్నించాడు చద్రశేఖరం'

'అవునండి వచ్చి వారం రోజులయింది'

'వచ్చినట్లు వార్త అందిస్తే సంతోషించేవాణ్ణి'

'అవును. కాని అవకాశం లేకపోయింది'

'ఒకసారి యింటికిరావచ్చుగా.'

'ఇప్పుడు పరాధీనను. ఒంటరిగా వచ్చే వీలులేదు. మావారినికూడా ఆహ్వానించండి, కలిసివస్తాం'

'తప్పకుండా, మీరు పరిచయం చెయ్యలేదు'

'మీరు పెళ్ళికిరాలేదు'

'అవును, అదితప్పేకావచ్చు, బహుమతి పంపాను'

'అందింది, కృతజ్ఞతలు. ఏదైనా బంగారుగడియారం బహుమతి యిస్తారనుకున్నా' మనోరమ మందహాసం చేసింది.

ఆమెమాటలు వ్యంగ్యమో నిజమో చంద్రశేఖరానికి అర్థంకాలేదు.

వివాహం స్వంతవిషయాలు తప్పించి బెంగుళూరు వాతావరణంగూర్చి ప్రసంగించింది మనోరమ. మునుపటికంటె ఎక్కువ చలాకీగా కనిపించింది. బహుశా వివాహం ఇచ్చినమార్పు అనుకున్నాడుచంద్రశేఖరం. మంగళతోకలిసి ఉండటంలేదని, విడిగా ఉంటున్నామని, ఆ ప్రక్కనేఉన్న హైస్కూలులో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నానని చెప్పింది మనోరమ. ఈ వార్త చంద్రశేఖరానికి మరీ ఆశ్చర్యం కలిగించింది. ఇన్నివిషయాలు తననుంచి మనోరమ ఎందుకు దాచిందా అని ఆలోచనలో పడ్డాడు చంద్రశేఖరం.

బస్సుజాడ పదిగజాలలో కనిపించింది.

మనోరమ బస్సుఎక్కడానికి ఒక అడుగు ముందుకు వేసింది.

'మీయింట్లో ఒకపూట భోంచెయ్యాలని ఉందండీ' అంది మనోరమ.

'తప్పకుండా రండి' అన్నాడు చంద్రశేఖరం.

'దంపతులను పిలవండి' అంది మనోరమ.

బస్సు రొదచేసుకుంటూవచ్చి వారి సంభాషణ ఆపివేసింది. మనోరమ కంగారుగా బస్సుఎక్కింది మందస్మితం చేస్తూ.

తన భర్త ఎవరో, తనబస ఎక్కడో, ఏమీ చెప్పకుండా, యింటికి రమ్మని ఆహ్వానించకుండా, తన భర్తనీ, తన్నూ భోజనానికి పిలవండి అన్న మనోరమ మాటలు అంతా గందరగోళంగా అనిపించాయి చంద్రశేఖరానికి.

తక్షణం బయలుదేరి మంగళ యింటికి వెళ్ళాడు. ఆ అద్దె యిల్లు మంగళ కాళీ చేసిందని విని మరీ చకితుడైయ్యాడు. మంగళ తనబస మార్చినట్లు కూడా అతనికి ఏమీ వార్త అందక పోవడం,పరిస్థితులలో ఏదో వైపరీత్యం వచ్చిందనుకున్నాడు చంద్రశేఖరం.

మంగళ, మనోరమ, ఊళ్ళో ఉన్నారని తెలిసినా చంద్రశేఖరం మళ్ళీ వాళ్ళని కలుసుకోలేక పోయాడు.

వివాహంతో, స్త్రీలో, విపరీతమైన మార్పు వస్తుందనుకున్నాడు చంద్రశేఖరం. మనోరమతో మొదటి పరిచయ

మయ్యాక, ఆమె మంగళ దగ్గరే వుండడం, తర్వాత తన్ను ఏదైన ఉద్యోగం యిప్పించమంటే ఒక కంపెనీలో గుమస్తా పని యిప్పించడం జరిగింది. గత రెండు సంవత్సరాలు ఆ కంపెనీలో ఉద్యోగం చేస్తూ, మంగళ యింట్లోనే ఉన్న మంగళతో చంద్రశేఖరానికి తగినంత స్నేహం ఏర్పడింది.

ఉద్యోగం పూర్తి చేసుకుని వీలైనప్పుడల్లా సాయంకాలం, సెలవు రోజుల్లో తన యింటికిరావడం ప్రపంచ విషయాలు ప్రశ్నలు వేస్తూ తెలుసుకోవడం, యిల్లు సర్ది, కావలసిన ముఖ్య అవసరాలు అందివ్వడంతో, మనోరమ చాలా మంచి మనిషనే అభిప్రాయం చంద్రశేఖరానికి ధృవ పడింది.

చంద్రశేఖరానికి ఒకసారి జ్వరం వచ్చింది.

మనోరమ నాల్గురోజులు సెలవు పెట్టింది ఉద్యోగానికి.

ఇంట్లోనే వుండి చంద్రశేఖరానికి, కాఫీ యివ్వడం, మందులందివ్వడం మొదలైన సేవలు చేసింది. మంగళ కూడా ఆమెను చంద్రశేఖరం దగ్గర వదిలి వేయడానికి సమ్మతించినట్లే కనిపించింది.

'సుఖంగా వున్నప్పుడు అందరూ ఆదరిస్తారు. కాని కష్టాల్లో వున్నప్పుడు ఎవరూ పలకరించరు. మీ సేవ, ఆదరణ మర్చిపోలేను. అన్నాడు చంద్రశేఖరం.'

'అవును. యిటువంటి జ్ఞాపకాలు చివరిదాకా మీకుఉంటే నాకు సంతోషం, అంది మనోరమ.'

'అంటే అంత త్వరలో మర్చిపోతానునుకున్నారా అంత కృతఘ్నుడినా?' కొంచెం బాధగా అన్నాడు చంద్రశేఖరం.

'కావచ్చు' నవ్వేసింది మనోరమ.

చంద్రశేఖరానికి ఏమనాలో అర్థం కాలేదు. అంతలోపల చాలా బాధ పడ్డాడు.

'నేను మీకోసలహాయివ్వనా' మనోరమ మందు అందిస్తూ కనురెప్పలు ఎత్తలేదు.

'ఏమిటి?'

'మీ జీవితం సుఖంగా ఉండాలంటే, నాలాంటివారికి కష్టంయివ్వకుండా ఉండాలంటే, మీరు మళ్ళీత్వరగా పెళ్ళి చేసుకోండి!' మనోరమ సలహా చంద్రశేఖరం మనస్సులో గ్రుచ్చుకుంది.

ఒకసారి తీక్షణంగా మనోరమవైపు చూశాడు. మనోరమ ఒకక్షణం అతని కళ్ళల్లోకి చూసి కంగారుగా దృష్టిత్రిప్పుకొని ప్రక్కగదిలోకి నడిచిపోయింది. మరికొద్ది క్షణాలలో అతని అనుమతి తీసుకుని యింటికి వెళ్ళిపోయింది మనోరమ.

నర్మగర్భంగా అన్న ఆమెమాటలు చంద్రశేఖరానికి అర్థమయ్యాయి. భార్య

జ్ఞాపకంవచ్చి దుఃఖించి ప్రక్కలో ఒరిగి పోయాడు చంద్రశేఖరం.

రోజులుగడిచాయి. ఒకసారి మనోరమ, చంద్రశేఖరం కులాసాగా ఏదో కబుర్లు చెప్పుకుంటున్నారు. మళ్ళీ ఆ ప్రసంగం కలిపింది మనోరమ. చంద్రశేఖరం నవ్వేశాడు తేలికగా.

'నా సలహా ఏమంటే. నాకంటె ముందు నీకు పెళ్ళికావాలి. తగినవరుడి కోసం ప్రయత్నించమని మంగళతో చెప్పాను. మీ అన్నగారికి ఉత్తరం వ్రాయనా ?.' అన్నాడు చంద్రశేఖరం.

'పెళ్ళికొడుకే అలా ఎదురుప్రశ్న వేస్తే ఏమనేది ?' మనోరమ నవ్వుతూ ముఖం దించుకుంది.

'నువ్వు పొరబడుతున్నావు మనోరమా ! నేనింక వివాహం చేసుకోను. ఒకసారి చేసుకున్నా. ఆ జ్ఞాపకాలుచాలు. తక్కిన సంబంధాలు పూర్తిగా నిష్కల్మషమైన స్నేహస్వరూపాలు అంతే' చంద్రశేఖరం ముఖంలో రక్తం ఉప్పొంగింది.

'క్షమించండి' మనోరమ ఏదో పుస్తకంతీసి ముఖం చాటుగాపెట్టుకుంది.

పదినిమిషాలు మౌనంతో యిద్దరూ కూర్చున్నారు.

ఆ పుస్తకంలో అమెరికాస్త్రీల అభ్యుదయంగురించి ఉన్నవ్యాసం చదివి చర్చకు పెట్టింది మనోరమ. తప్పని



"డ్రెసింగ్ రూమ్‌నించి 'రింగ్' వరకు అంత దూరం నడిచివెళ్ళడం కష్టం కదండి ?"
"కష్టమేముందండి వచ్చేటప్పుడు మీరు నడిచిరానక్కరలేదుగా."

సరిగా కలిసి కాస్సేపు సంభాషించుకున్నారు.

మరికొన్నిదినాల తర్వాత మంగళ, మనోరమ 'చంద్రశేఖరం దగ్గరికి వచ్చారు. సినిమాలు, స్నేహితులు చర్చకువచ్చారు.

ఆ రోజు మనోరమ చాలా ఆనందంగా కనుపడింది.

'పిల్ల చాలా చలాకిగా ఉంది' అంది మంగళ.

'పెళ్ళి కళ కనిపిస్తోంది ముఖంలో' అన్నాడు చంద్రశేఖరం.

'ఆ ! యీ జన్మలో అయినప్పుడు చూద్దాం' అంది మనోరమ.

'ఈ సంవత్సరంలో అయితీరుతుంది.... లేకపోతే నే ఉన్నాగా !' అన్నాడు చంద్రశేఖరం హాస్యంగా, ఛలోక్తిగా.

మనోరమ చంద్రశేఖరం వైపు సూటిగా ఒక క్షణం చూసింది. మంగళ ఆలోచనలో పడింది. తర్వాత మంగళ ఒంటరిగా చంద్రశేఖరాన్ని ప్రశ్నించి, అతని మనస్సు గ్రహించి ఊరుకుంది.

మంగళ, తొందర చేసింది. చెల్లెలి పెళ్ళికి, ప్రయత్నాలు సఫలమైయాయి. మనోరమ వివాహం నిశ్చయమైంది.

వచ్చి చెప్పింది మనోరమ తన వివాహం గురించి. భర్త ఎవరో, అతని వివరాలు ఏమిటో, తనకి, తప్ప అందరికి తెలుసునంది. అందుచేత నిర్లిప్తంగా వివాహాని కొప్పుకున్నానంది. చంద్రశేఖరం ఆలోచించాడు మనోరమ తనపై కక్షతీర్చుకుంటుందా అని. బాధ పడ్డాడు అతను ఒక క్షణం, కాని ఏమీ అనలేదు.

ఈ సన్నివేశంతర్వాత మళ్ళీ మనోరమ కనిపించడం బస్సుస్టాండువద్దే. కంపెనీలో ఉద్యోగం మానేసింది వివాహం ముందు. వివాహంకాగానే యీ వూరు రావడం, స్కూలులో చేరడం, అన్నీ తనకు తెలియకుండా జరిగిపోయాయని ఆలోచనలో పడ్డాడు చంద్రశేఖరం. మనోరమ ఎంతచలాకీగా కనిపిస్తోందో, అంతదూరమై పోయినట్లుకూడా గుర్తించాడు చంద్రశేఖరం.

ఒకనాడు మధ్యాహ్నం కునుకు తీసి వార్తాపత్రిక తిరగవేస్తున్నాడు చంద్రశేఖరం.

మంగళ తలుపు తట్టి లోనికి ప్రవేశించింది.

ఆమెరాక చంద్రశేఖరానికి ఆశ్చర్యం కలిగించలేదు కాని, ఆమె ముఖంలో ఏదో బలవంతపు ఆనందం మాత్రం ఉన్నట్లు స్పష్టంగా పరిశీలించ గలిగాడు చంద్రశేఖరం.

మంగళ తన బసమార్పుగురించి చెబుదామని వచ్చానంది. తనసంతానం, వారిచదువులు, తనచర్య యింటిపట్టు లేకుండా తిరిగే నిర్లక్ష్యం చెప్పుకుంది. అయినా నలభై ఏండ్లువస్తున్న తనకేమిటి అని వేదాంత ధోరణిలో మాట్లాడింది. చంద్రశేఖరం క్షేమంగురించే నిత్యమూ ప్రశ్నించే మంగళ ఆనాడు తన గొడవలే చెప్పుకు పోసాగింది. చంద్రశేఖరం ఓపిగ్గా వింటున్నాడు. మనోరమ ప్రసంగం వచ్చింది గాని, వాళ్ళు ఫలానా చోట ఉంటున్నారని ముక్తసరిగా జవాబిచ్చింది మంగళ. ఆమెలో ఏదో మార్పు వచ్చినట్లు గమనించాడు. చంద్రశేఖరం.

మధ్యలో హఠాత్తుగా ప్రశ్నించింది మంగళ.

'ఏమండీ' మిమ్మల్ని ఒక్కటి ప్రశ్నించాలనుకుంటున్నాను. ఏమను కోకండి?'

చంద్రశేఖరం నవ్వాడు సమాధాన మిస్తానని.

మగవాళ్ళకు నీతి, నియమాలు ఉన్నా యంటారా!

మంగళ ప్రశ్న చంద్రశేఖరంలో బ్రహ్మాండమైన సంచలనం కలిగించింది నిజంగా. నీతి నియమాలతో స్నేహంగా బ్రతుకుతున్న తన్ను ఆ విధంగా ఆమె ప్రశ్నించడం అసందర్భం, అసభ్యం, అని లోలోపల రుద్రుడై పోయాడు అతను.

'అసలు ఏం జరిగింది! తాపీగా ప్రశ్నించాడు చంద్రశేఖరం.'

'మీ దగ్గర దాపరికమెందుకు. ఒక రహస్యం మీకు చెప్పేస్తాను.'

'చెప్పండి.'

'మా యింటి ప్రక్క లాయరు వెంకటేశం మీ స్నేహితుడేగా! ఆయన ద్వారానే మీరు మాకు అద్దె యిల్లు యిప్పించారు. జ్ఞాపకముందా.'

'అవును.'

'ఒకరోజు నేను ఆయనవద్దకు ఒక వితంతుస్త్రీని తీసుకవెళ్ళాను. ఆమె బాల వితంతువు. ఆమె ఆస్తివిషయాలలో ఏదో తగాదా వచ్చిందంటే స్నేహం పురస్కరించుకుని, లాయరు వెంకటేశంగారిని పరిచయంచేశాను. ఆ తర్వాత వారిద్దరూ....ఏంచెప్పను...ఇది చాలా అన్యాయంకదండీ... ఒకమంచి వితంతుస్త్రీని మగవాడు చెరచడం—మీరు ఎట్లాగైనా ఆమె బంధువులతో ఈ విషయం చెప్పి ఈఅన్యాయం మాపాలండీ! నాకు గుండె తరుక్కుపోతోంది........

ఎందుకు యిలాజరుగుతున్నదని? చంద్రశేఖరానికి, ఈవార్త,వార్తధోరణి, ఆమె హావభావచేష్టలు, వాటివెనుక ఆమె బాధ చాలా చిత్రంగా కనిపించాయి. ఎవరో స్త్రీ చెడిపోతే ఆమెకు బాధ ఎందుకు? పైగా ఆమె ఎవరో తెలియనప్పుడు ఆమెబంధువులతో, తను చెప్పడ మేమిటి?'

'పోనీ మీరే ఆ అమ్మాయిని పిల్చి చెప్పలేకపోయారా, అలాప్రవర్తించడం బాగుండదని. ఆమె, ఆమె బంధువులు నాకుతెలియదు.... నేను ఎలా మందలించను ఈసంగతిగురించి', అన్నాడు చంద్రశేఖరం.

'పోనీ, మీ లాయరు స్నేహితుడితో నైనా చెప్పండి ఆమెను చెడగొట్టడం భావ్యంకాదని'

ఇది గొంతులోపడ్డ వెలగముక్కలా ఉంది చంద్రశేఖరానికి. ఒకస్నేహితుడితో స్వంతవిషయాలలో కలుగజేసుకొని ఏంమాట్లాడగలడు—అందులో యీవార్త నిజమో కాదో, అయినా ఈ

విషయం లాయరుతో కదపడం కొంచెం క్లిష్టమైనసంగతి, అనుకున్నాడు చంద్రశేఖరం.

ఈ విషయంలో మనం కలుగజేసుకోకూడదండీ.' అన్నాడు ముభావంగా చంద్రశేఖరం.

'అక్కడికే ఆమెతండ్రికినేను ఆకాశ రామన్నవుత్తరాలు వ్రాశాను' అంది మంగళ బాధగా.

చంద్రశేఖరం వింటూకూర్చున్నాడు. కాస్సేపటికి ఆమె చర్చనీయాంశం మార్చింది. చంద్రశేఖరం క్షేమం కనుక్కుంది. ఎప్పుడైనా తమ క్రొత్త యింటికి రమ్మని ఆహ్వానించి వెళ్ళిపోయింది మంగళ.

జీవితంలో ఏదీ యీనాడు సూటిగా కనిపించటంలేదు. అంతా తికమకగా ఉంది. అనుకున్నాడు చంద్రశేఖరం అయితే మంగళ ఎందుకు బాధపడుతుందో, ఆ బాధయొక్క అంతర్గతమైన భావమేమిటో కొంచెం పసికట్టినా చంద్రశేఖరం బయటికి ఆ విషయం పొక్కకూడదనుకున్నాడు. తన అనుమానానికి నిర్ధారణ ఏదీ అని ప్రశ్నించుకున్నాడు. ఇంతకీ ఎవరిది తప్పు అని ప్రశ్నించుకున్నాడు.

నాల్గు దినాల తర్వాత టెలిఫోన్ మ్రోగింది. మనోరమ పిల్చింది. ఆ రోజు మధ్యాహ్నం భోజనానికి వస్తున్నా యింటి దగ్గర ఉండమంది. చంద్రశేఖరం కొద్దిగా నివ్వెరపడినా, ఆమెతో తనకున్న పరిచయం దృష్ట్యా సంతోషంతో సరే అన్నాడు.

మధ్యాన్నం పన్నెండుగంటలకు మల్లెపూలు తురుముకొని, మందహాసంతో యింటిలో అడుగుపెట్టింది మనోరమ. రెండు అరటిపండ్లు బహూమతిగా తెచ్చింది చంద్రశేఖరానికి. పెండ్లికివస్తే మీరిచ్చిన బహూమతికి అరటిపండు తాంబులం అందేది. లేదు కాబట్టి యీ అరటిపండ్లు బహూమతి మీకు! అంది మనోరమ నవ్వుతు.

చంద్రశేఖరం పండు కొరికాడు. రెండుసార్లు.

'చాలా తియ్యగాఉంది.' అన్నాడు.

'ఎంగిలిపండు యింకా తియ్యగా ఉంటుంది' కొంచెంగా నవ్వింది మనోరమ.

ఆమె పెళ్ళి విషయాలు ఛోగట్టా చేశాడు చంద్రశేఖరం. మనోరమ చలాకీగా పకాపక నవ్వుతోంది. స్కూలుకు సెలవుపెట్టి ఆమె తన యింటికి తాపీగా రావడం ఒంటరిగా రావడం, మల్లెపూలు తురుముకు రావడం, ప్రతి మాటకు పకపక నవ్వడం, చంద్రశేఖరానికి ఒక విధంగా మత్తు కలిగించింది.

తన భర్త చాలా మంచివారనీ, అయిదువందల రూపాయిల జీతమనీ, తన మామగారికి పెద్ద బంగళా, కారు, నౌకర్లు ఉన్నారని, తన కింత అదృష్టం పడుతుందని కలలో కూడా అనుకోలేదని నవ్వింది మనోరమ.

బహుశా మనోరమ అదృష్టం ముందు తానుబలాదూర్ అని శంకించాడు చంద్రశేఖరం.

మనస్సులో పెరిగిన మత్తు కొంచెం చెదిరిపోయింది.

ఇద్దరూ ఖులాసాగా కబుర్లు చెబుతూ భోజనం చేశారు.

తాంబూలం చుట్టి యిచ్చింది మనోరమ.

చంద్రశేఖరం ఆనందంగా అందు కున్నాడు.

'మీ వారిని పరిచయం చేయాలి నాకు' అన్నాడు చంద్రశేఖరం మర్యాదగా.

'తప్పకుండా. ఎప్పుడైనా రండి మా యింటికి' అని చిరునామా యిచ్చింది మనోరమ. వెడతానంటూ లేచింది కాస్సేపటికి.

'సెలవుపెట్టి అంత తొందరగా యింటికి వెళ్ళడమెందుకు?' ప్రశ్నించాడు చంద్రశేఖరం సాలోచనగా.

ఆ ప్రశ్నకోసమే ఎదురు చూస్తున్నట్లు ఆమె గబుక్కున కూర్చుంది మళ్ళీ.



"సాయంగా మరియాదా అదీ చేస్తున్నాడు, బుద్ధిమంతుడే; పెళ్ళికొడుకు..........
ఏం చేస్తున్నాడేవిఁటి?...."
"వాడికేమయ్యా? బంగార్లాటి కండక్టర్! సిటీబస్ కండక్టర్!"

మనోరమ మేజామీది పుస్తకం ఒకటి తెరచి ముఖం చాటు పెట్టుకుంది.

చంద్రశేఖరం ఆలోచనలో పడ్డాడు ఆమె అందం పరిశీలిస్తూ.

మనోరమ హఠాత్తుగా గొల్లున ఏడ్చింది. వెక్కి వెక్కి ఏడుస్తూ బాధగా తలగడలో తల దాచుకుంది.

చంద్రశేఖరం నిశ్చేష్టుడై పోయాడు.

'ఏమిటి మనోరమా! ఆత్రుతగా అడిగాడు.

ఆమె రోదనస్థాయి పెరిగింది పది నిమిషాలు. తర్వాత బాధగా అరిచింది.

'నా భర్త కుష్ఠురోగి. ఆయనకు మేడలూ లేవు. మిద్దెలు లేవు....వారిది పెద్ద కుటుంబం. బీదవాళ్ళు. అక్కడ నేను దాసిని....'

మనోరమ ఏడ్పు హెచ్చింది.

'నా బాధలు ఎవరి క్కావాలి. నా బ్రతుకు నాశన మయింది.' ఆమె బాధ చంద్రశేఖరం హృదయాన్ని కలచింది.

'నేనుఎలా బ్రతుకను?' అరిచింది బాధగా మనోరమ.

'పెళ్ళిలో మీవాళ్ళ కళ్ళు మూసుక పోయాయా' రుద్రుడై కేకవేశాడు చంద్రశేఖరం.

'మధ్యవర్తులు మసిచేశారు. మావాళ్ళు తొందరపడ్డారు. పెళ్ళిలో తెలిసింది.... ప్రయోజనం'?.... మీరు పెళ్లికివచ్చి ఉంటే.... పరిస్థితులు మారే వేమొ.'

మనోరమ బాధగా ఎరుపెక్కిన విషాద నయనాలతో మెల్లిగా అంది. 'ఆయన కుష్ఠు ప్రారంభదశలో ఉంది.. తర్వాత ఏమౌతుందో?'

ఆమె కళ్ల కెదురుగా శూన్యం గోచరించింది.

వెడతానని లేచింది మనోరమ.

'ఈవార్త చెప్పడానికి వచ్చాను' అన్నది ఆమె. బరువుగా బాధగా కదిలిపోయింది మనోరమ.

చెదిరిపోయిన మనస్సులో, బాధ పెరిగి మౌనంగా వెళ్లిపోతున్న మనోరమవైపు చూశాడు చంద్రశేఖరం ఏమనలేక,

ఏదో పెద్ద తప్పు జరిగినట్లుగా కుమిలి బాధపడ్డాడు చంద్రశేఖరం. లోలోపల అయినా బాహ్యంగా ఒక నిశ్చయానికి రాలేకపోయాడు. ఎవరి జీవితగతికి ఎవరు బాధ్యులు? ఆత్మీయత పెరిగిన వాతావరణంలో వ్యక్తుల జీవిత పరిణామాలకు ఎవరు ఎంతవరకు కారకులు? ఎవరిది తప్పు? తనలో తాను తర్కించుకుంటూ కుమిలి పోయాడు చంద్రశేఖరం.

